RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 312 | సంపుటి 4 | మంగళవారం | 18-08-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

## కేసముద్రం రాజకీయాల్లో సమ్మిగౌడ్ జోష్..

### కాంగ్రెస్‌లో పెరిగిన కొత్త ఉత్సాహం!



- సమ్మి గౌడ్ అధ్యక్ష పదవితో మారిన స్థానిక రాజకీయ సమీకరణాలు
- పార్టీలో నయా జోష్.. కొత్త వరవడికి శ్రీకారం
- కేసముద్రం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన స్థితి
- గడపగడపకూ సమ్మిగౌడ్..కాంగ్రెస్ శ్రేణుల్లో మునుపెన్నడూ లేని ఉత్తేజం

కేసముద్రం, ఆగస్టు 17 (ప్రభాత గమనం) :

కేసముద్రం నియోజకవర్గ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒక్కటే పేరు మార్మోగుతోంది... ఆ పేరే సమ్మి గౌడ్! ఆయన కాంగ్రెస్ అధ్యక్ష పదవి పుచ్చుకోవడంతో స్థానిక రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇప్పటివరకు ఒకెత్తు... సమ్మి గౌడ్ పార్టీలో పదవి చేపట్టిన తర్వాత మరొకెత్తు అన్నట్లుగా కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం ఉప్పొంగుతోంది. ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడంతో కేసముద్రంలో పార్టీ గ్రాఫ్ ఊహించని రీతిలో పైకి లేచింది.సమ్మి గౌడ్ తో కాంగ్రెస్ పార్టీకి కొత్త రక్తం ఎక్కినట్లయిందని, కార్యకర్తల్లో మునుపెన్నడూ చూడని నయా జోష్ కనిపిస్తోందని స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ పగ్గాలు చేతపట్టి, క్షేత్ర స్థాయిలో ప్రజలను సమాయత్తం చేయడంలో ఆయన చూపిస్తున్న చొరవ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త వరవడికి శ్రీకారం చుట్టిందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.సాధారణ కార్యకర్తలతో నేరుగా మమేకమవుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తే తత్వం ఉన్న సమ్మి గౌడ్ రాక ప్రత్యర్థి వర్గాల్లో వణుకు పుట్టిస్తోంది. ఆయనకు ఉన్న ప్రజాదరణ, బీసీ సామాజిక వర్గాల్లో ఉన్న పట్టు కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని బలాన్ని చేకూస్తున్నాయి. కేవలం అధ్యక్ష బాధ్యతకే పరిమితం కాకుండా, నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని, ప్రతి వీధినీ చుట్టేస్తూ కార్యకర్తలకు కొండంత అండగా నిలుస్తున్నారు. సమ్మి గౌడ్ అనుసరిస్తున్న వ్యూహాత్మక అడుగులు, శ్రేణులను ఏకం చేసే తీరు ఇప్పుడు కేసముద్రం రాజకీయాల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.సమ్మి గౌడ్ నాయకత్వంపై, ఆయన పనితీరుపై నమ్మకంతో వివిధ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, యువత పెద్ద ఎత్తున కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, పార్టీని గడపగడపకూ తీసుకెళ్లేందుకు ఆయన పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఆయన అందిస్తున్న దిశానిర్దేశంతో కాంగ్రెస్ కేడర్ సరికొత్త వ్యూహాలతో ప్రజల్లోకి దూసుకెళ్తోంది.మొత్తానికి, సమ్మి గౌడ్ ఎంట్రీతో కేసముద్రంలో కాంగ్రెస్ జెండా కొత్త కాంతులతో రెపరెపలాడుతోంది. రాజకీయ సమీకరణాలను తనవైపు తిప్పుకుంటూ, రాబోయే రోజుల్లో ఆయన వేయబోయే వ్యూహాత్మక అడుగులు నియోజకవర్గంలో మరిన్ని కీలక మార్పులకు సంకేతంగా నిలవబోతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు...!

> కేసముద్రం నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో సమ్మి గౌడ్ పేరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో కేడర్ ను సమన్వయం చేస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతూ ఆయన ముందుకు సాగుతున్న తీరు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్థాయి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేసేందుకు సమ్మి గౌడ్ చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్ కు కొత్త ఊపునిస్తున్నాయని స్థానిక నేతలు పేర్కొంటున్నారు.



## ఆపదలో అండగా చిలువేరు సమ్మయ్య గౌడ్

కేసముద్రం ఆగస్టు 17(ప్రభాత గమనం):

కేసముద్రం ప్రజల కష్టాల్లో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ మండల అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ అన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సోమారపు సామెల్ మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ పరామర్శించారు. మృతుడి భార్య ముత్తమ్మ, కుమారుడు యాకుబ్‌ను పరామర్శించి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం 50 కిలోల బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ..ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ముందుండి సహాయం చేయడం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా సమ్మిగౌడ్ ఫౌండేషన్ స్థాపకుడిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన సమ్మయ్య గౌడ్‌ను పాస్టర్ జీవన్‌తో పాటు ఎన్టీఆర్ నగర్ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ వల్లందాస్ ఉమా రవి, కాంగ్రెస్ నాయకులు చిట్ల సంపత్, కీర్తి సురేందర్, మాసాడి శ్రీనివాస్, అజ్మీర రమేష్, పోలపల్లి వెంకటరెడ్డి, కత్తెరశాల శ్రీనివాస్, ఎన్నమాల మహేందర్, పాస్టర్ జీవన్, రమేష్ నాయక్, సోమ్కుండ్ల సుభాష్ రెడ్డి, సంకపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సమ్మిగౌడ్ ను సన్మానించిన సీనియర్ జర్నలిస్టులు

కేసముద్రం ఆగస్టు 17(ప్రభాత గమనం):

ఇటీవలే కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టిన చిలువేరు సమ్మయ్య గౌడ్ ను సోమవారం నాడు సీనియర్ జర్నలిస్టులు రాజేశ్వర రావు, రవిచంద్ర లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమ్మిగౌడ్ ఇంటికి వెళ్లి శాలువాతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజలకు మరిన్ని సేవలు చేసి ఎన్నో ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు.






## జహీరాబాద్ స్మార్ట్ సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

- స్మార్ట్ సిటీ పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి
- రూ.15 వేల కోట్ల పెట్టుబడులను తీసుకువస్తాం

: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 17 :

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులన్నీ 2028 మార్చి వరకు పూర్తి చేస్తామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామికవాడకు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌లు న్యూదిల్లీ నుంచి సోమవా రం నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (ఎన్ఐసీడీఐటీ) వీడియో కాన్ఫరెన్సులో సచివాలయం నుంచి శ్రీధర్‌బాబు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు పాల్గొన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్‌బాబు వివరించారు. ఈ స్మార్ట్ సిటీలో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 51 శాతం ఉండగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు అందజేస్తోంది. ఈపీసీ పద్ధతిలో జరగుతున్న పనులు ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తవుతాయిని వెల్లడించారు. నీటి సరఫరా పనుల టెండర్ల ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. విద్యుత్తు సరఫరా పనులను కూడా గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. భవ్య పథకం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణాకు కేటాయించాలని మంత్రి పీయూష్ గోయల్‌ను శ్రీధర్‌బాబు కోరారు. వీడియో కాన్ఫరెన్సులో టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

2 ప్రభాత గమనం వరంగల్, మంగళవారం, 18-08-2026

# విద్యార్థులను కలవండి..చర్చించండి

- జార్ఖండ్ సీఎం సోరెన్‌కు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ,ప్రభాతగమనం ఆగస్ట్17:

జార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు చేపట్టిన ఆందోళనపై రాహుల్ గాంధీ స్పందించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను స్వయంగా కలిసి వారి సమస్యలను వినాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కోరారు. ఈ మేరకు ఆగస్టు 14న సోరెన్‌కు రాహుల్ గాంధీ లేఖ రాశారు. రాంచీలో 24వ రోజులుగా విద్యార్థుల ఆందోళన శాంతియుతంగానే సాగుతోందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. జార్ఖండ్‌లోని పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా చూడటానికి ముఖ్యమంత్రి స్వయంగా విద్యార్థులను కలిసి వారి ఆందోళనలను వినాలి. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి' అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.




# అంగన్‌వాడీలకు పెరిగిన రిటైర్మెంట్ బెనిఫిట్స్

- 60ఏళ్లు దాటిన వారు స్వచ్ఛందంగా వైదొలగినా ప్రయోజనం
- ఇప్పటివరకు 2,572 మందికి రూ.15.61 కోట్ల చెల్లింపు
- ప్రత్యేక చొరవ చూపిన మంత్రి సీతక్క

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 17 :

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం పెంచిన సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్ అందిస్తోంది. 65 ఏళ్ల వయస్సులో రిటైర్ అయిన వారికి పెంచిన మొత్తంతోపాటు 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలగినా ఈ ప్రయోజనాలు వర్తింపజేస్తోంది. 2023లో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, అంగన్‌వాడీ హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.50 వేలుగా ఉన్న సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌ను మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో 2025 మే 30న ప్రజా ప్రభుత్వం పెంచింది. కొత్త ఉత్తర్వుల ప్రకారం 65 ఏళ్ల వయస్సులో వైదొలగే అంగన్‌వాడీ టీచ ర్లకు రూ.2 లక్షలు, అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.లక్ష చొప్పున అందిస్తున్నారు. అదేవిధంగా 60 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్వచ్ఛందంగా విధుల నుంచి వైదొలగిన సందర్భంలో కూడా అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున వలంటరీ డిస్ ఎంగేజ్‌మెంట్ బెనిఫిట్ అందించే అవకాశం కల్పించారు.

## రూ.15.61 కోట్లు చెల్లింపు

2026–27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 2,572 మంది అంగన్‌వాడీ సిబ్బంది ఖాతాలకు రూ.15,61,10,000 సర్వీస్ ఎండ్ బెనిఫిట్స్‌గా చెల్లించారు. ఇందులో 473మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.4.73 కోట్లు,1,930 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.9.65 కోట్లు చెల్లించారు. పెంచిన బెనిఫిట్స్ ప్రకారం మరో 14 మంది అంగన్‌వాడీ టీచర్లకు రూ.28 లక్షలు, 59 మంది అంగన్‌వాడీ హెల్పర్లకు రూ.59 లక్షలు అందించారు. గతంలో అమలులో ఉన్న ఉత్తర్వుల ప్రకారం మరో 96 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రూ.36.10 లక్షలు చెల్లించారు. గత ప్రభుత్వంలో రిటైర్ అయిన అంగన్‌వాడీ సిబ్బందికి సైతం ఈ ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించింది. అంగన్‌వాడీ సిబ్బందికి పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు, దీర్ఘకాలంగా సేవలందించిన వారికి గౌరవప్రదమైన ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది.



# యువతి దారుణ హత్య

- ప్రేమ పేరుతో శారీరంగా లోబర్చుకున్న యువకుడు
- గర్భం దాల్చడంతో హత్యకు ప్లాన్

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్ట్ 17:

హైదరాబాద్‌లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి దారుణ హత్యకు గురైంది. ప్రియురాలిని ప్రియుడు హత్య చేసినట్లు తెలుస్తోంది. ప్రియురాలిపై అనుమానమే ఈ హత్యకు కారణమని బాలాపూర్ పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందగానే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతురాలిని బిహార్‌కు చెందిన యువతిగా గుర్తించారు. స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో మృతురాలు పనిచేస్తోంది. ఆమెను ప్రేమ పేరుతో బాలాపూర్‌కు చెంది న అహ్మద్ దగ్గరయ్యాడు. ఇటీవల యువతి గర్భం దాల్చింది. ఈ విష యాన్ని అహ్మద్‌కు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆమె గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని అతడిని బలవంతం చేసింది. దీంతో ప్రియురాలి అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడు ప్లాన్ చేశాడు. తల్లిదండ్రులతో కలిసి యువతిని అహ్మద్ హత్య చేసినట్లు సమాచారం. ఈనెల16న మృతదేహాన్ని గోనే సంచిలో తరలిస్తుండగా స్థానికులు అనుమానించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులను అదుపులోకి తీసుకున్నారు.

# పొలిమేర దాటొచ్చిన బోనం..

- అరిష్టమా? లేక ఆచార విరుద్ధమా.?
- ఒక ఊరి బోనం మరో ఊరి పొలిమేరకు చేరడంపై చర్చ
- సంప్రదాయాల మాటున రాజకీయ పెత్తనంపై విమర్శలు

కేసముద్రం, ఆగస్టు 17 (ప్రభాత గమనం):



గ్రామీణ తెలంగాణలో పండుగలకు ఓ ప్రత్యేకత ఉంది. గ్రామదేవతను కొలవడం నుంచి బోనాల సమర్పణ వరకు ప్రతి గ్రామానికీ తనదైన ఆచారం, సంప్రదాయం, నమ్మకం ఉంటుంది. అయితే ఒక గ్రామంలో నిర్వహించిన బోనం ఆ గ్రామ పొలిమేర దాటి మరో గ్రామం పరిధిలోకి చేరడం ఇప్పుడు కేసముద్రం ప్రాంతంలో చర్చకు దారితీసింది. ఇది అరిష్టానికి సంకేతమా? సాంప్రదాయ విరుద్ధమా? లేక మారుతున్న కాలానికి అనుగుణంగా ఏర్పడుతున్న కొత్త విధానమా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.పూర్వకాలం నుంచి అనేక గ్రామాల్లో "ఏ ఊరి పండుగ ఆ ఊరిలోనే.. ఏ ఊరి బొట్టు ఆ ఊరికే" అనే నానుడి బలంగా ఉంది. గ్రామదేవత, బొడ్రాయి, పొలిమేరలు వంటి అంశాలకు గ్రామీణ సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది. గ్రామం మున్సిపాలిటీలో విలీనం అయినా, పరిపాలనా సరిహద్దులు మారినా, తరతరాలుగా వస్తున్న గ్రామ ఆచారాలు ఒక్కసారిగా మారిపోవని పలువురు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. "మున్సిపాలిటీ ఒక్కటైందని గ్రామాల ఆచారాలు కూడా ఒక్కటైపోవు కదా అని పలువురు అంటున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన బొడ్రాయిలు, గ్రామదేవతల స్థానాలు అలాగే ఉన్నప్పుడు పండుగల విషయంలోనూ స్థానిక సంప్రదాయాలను గౌరవించాలి" అని స్థానిక ప్రజలు అంటున్నారు.అసలు వివాదం బోనం పొలిమేర దాటడంపైనేనా? లేక దాని వెనుక ఉన్న రాజకీయ ఆధిపత్య పోరే కారణమా? అనే చర్చ కూడా మొదలైంది.గ్రామాల్లో జరిగే పండుగలు ప్రజల భక్తి, విశ్వాసాలకు సంబంధించినవి. అలాంటి వేడుకలను కూడా కొందరు తమ వ్యక్తిగత ప్రాబల్యం, రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటే గ్రామ ప్రజల మధ్య అనవసరమైన విభేదాలు తలెత్తే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "మన ఊరి ప్రయోజనం కంటే ఎవరి వ్యక్తిగత ప్రయోజనం ముఖ్యం కాదు. నాయకత్వం అంటే ప్రజలను కలుపుకుపోవాలి తప్ప.. గ్రామ సంప్రదాయాలను పక్కనపెట్టి ఆధిపత్యాన్ని ప్రదర్శించడం కాదు" అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బోనం మరో గ్రామం పొలిమేరలోకి రావడం వల్ల అరిష్టం జరుగుతుందని చెప్పడానికి శాస్త్రీయ ఆధారం ఉందా? అనే ప్రశ్న ఒకవైపు ఉంటే.. స్థానికంగా తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలను ఉల్లంఘించడం సరికాదనే వాదన మరోవైపు ఉంది.ఇలాంటి విషయాల్లో మూఢనమ్మకాలను ప్రోత్సహించకుండా, అదే సమయంలో ప్రజల విశ్వాసాలను అవహేళన చేయకుండా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. గ్రామ పెద్దలు, పండుగ నిర్వాహకులు, ఆలయ ప్రతినిధులు, పండితులు కలిసి చర్చించి ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సంప్రదాయాలపై స్పష్టత తీసుకురావాలని కోరుతున్నారు.పండుగలు గ్రామ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావాలి, కానీ అదే పండుగ గ్రామాల మధ్య వివాదానికి, రాజకీయ ఆధిపత్యానికి కారణమైతే అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని స్థానికులు అంటున్నారు. ఒక ఊరి పొలిమేరకు మరో ఊరి బోనం చేరినప్పుడు ప్రశ్నించాల్సింది అరిష్టం వస్తుందా? అన్నది మాత్రమే కాదు.. ఆ బోనం ఎందుకు వచ్చింది? ఎవరి నిర్ణయంతో వచ్చింది? స్థానిక సంప్రదాయాలను గౌరవించారా? అనే ప్రశ్నలకు కూడా సమాధానం కావాలి అని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాల మధ్య ఉన్న ఆచారాలు, సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను రాజకీయ స్వార్థాలకు దూరంగా నిర్వహించాలని, భవిష్యత్తులో ఇలాంటి అంశాలు వివాదాలకు దారితీయకుండా గ్రామ పెద్దలు, సంబంధిత నాయకులు స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.భక్తి పేరుతో సంప్రదాయం మరుగున పడకూడదు.. సంప్రదాయం పేరుతో రాజకీయ స్వార్థం ముందుకు రాకూడదు. ఇదే ప్రస్తుతం కేసముద్రం ప్రాంతంలో వినిపిస్తున్న ప్రధాన అభిప్రాయం.



# ప్రతీ ఆరు నెలలకో కొత్త హాస్పిటల్

- 2027 డిసెంబర్ నాటికి అన్ని దవాఖానలు సిద్ధం!
- బీఆర్ఎస్ నేతలు టిమ్స్‌కు కొబ్బరికాయ కొట్టి మరిచిపోయారు!
- "మీరే కడితే మీరెందుకు రిబ్బన్ కట్ చేయలేదు?"
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్ట్ 17:

బీఆర్ఎస్ నాయకులు సనత్ నగర్ టిమ్స్ హాస్పిటల్‌కు కేవలం కొబ్బరికాయ కొట్టి మరిచిపోయారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాతనే హైదరాబాద్‌లోని మూడు టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. నత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను టిమ్స్ వద్దకు తీసుకువచ్చి 'ఇదంతా మేమే కట్టాం' అని గొప్పలు చెప్పుకుంటున్నారని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం కూడా వేగంగా సాగుతోందని, 2027 డిసెంబర్ నాటికి తెలంగాణలోని అన్ని ప్రధాన ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేసి ప్రారంభపిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్య పరిరక్షణను తమ బాధ్యతగా భావిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రజాపాలనలో విద్య మరియు వైద్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని, తెలంగాణ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా లభించే అవకాశాలను అందుకునేలా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

## కార్పొరేట్ కు దీటుగా..

కాగా కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఇది. 11వందల బెడ్లు, 300 ఐసీయూలతో, 31 మేజర్ ఆపరేషన్ థియేటర్ల సామర్థ్యంతో ప్రజలకు వైద్య సేవలను అందించబోతోంది.ఈ ఆస్పదేశంలోనే తొలిసారి ప్రభుత్వ రంగంలో ఏఐ న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్ అందుబాటులోకి తెచ్చారు. ఆస్పత్రిలో ఎక్కడికైనా 2 నిమిషాల్లోనే శాంపిల్స్, రిపోర్ట్స్, మందులు, పరికరాలు చేరవేసే సదుపాయం ఉంది. 22.6 ఎకరాల విస్తీర్ణంలో, 11.70 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంతో నాలుగు ప్రధాన బ్లాకులుగా క్లాసిక్ ఆర్కిటెక్చర్‌తో ఈ హాస్పిటల్‌ను నిర్మించారు. డయాగ్నస్టిక్స్ విభాగంలో 17 పాథాలజీ, 12 మైక్రోబయాలజీ, 10 బయోకెమిస్ట్రీ, మరో 5 స్పెషల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. బ్లాక్ --ఏలో ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్, 15 ఆపరేషన్ థియేటర్లు, 30 ఐసీయూ బెడ్లు, సెంట్రల్ స్టైరైల్ సర్వీస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. బ్లాక్–బీలో ఓపీ రిజిస్ట్రేషన్, సెంట్రల్ ఫార్మసీ, కార్డియాక్ ఆపరేషన్ థియేటర్, లీనాక్ ఆధారిత న్యూక్లియర్ మెడిసిన్ విభాగం, రెండు క్యాథ్‌ల్యాబ్‌లు ఉన్నాయి. బ్లాక్–సీలో రేడియాలజీ, పాథాలజీ ల్యాబ్‌లతో పాటు సాధారణ, ప్రైవేట్ వార్డులు, వీఐపీ సూట్లు ఉన్నాయి. బ్లాక్ డీని అడ్మినిస్ట్రేషన్, అకడమిక్ విభాగాలతో పాటు 200 మంది కూర్చునే ఆడిటోరియంతో తీర్చిదిద్దారు.

## ట్యూబ్ సిస్టంతో శాంపిల్స్..

దేశంలోనే తొలిసారిగా ఒక ప్రభుత్వ హాస్పిటల్‌లో ఏఐ ఆధారిత న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ వ్యవస్థ ద్వారా బ్లడ్ శాంపిల్స్, మందులు, రిపోర్టులు, ఎమర్జెన్సీ వస్తువులను వార్డులు, ఐసీయూ, ల్యాబ్‌లు, బ్లడ్ బ్యాంక్‌ల మధ్య కేవలం 1 నుంచి 2 నిమిషాల్లోనే చేరవేయవచ్చు. రోగ నిర్ధారణ కోసం 3.0 టెస్లా ఎంఆర్ఐ, 128–స్లైస్ సీటీ స్కానర్, అడ్వాన్స్‌డ్ మామోగ్రఫీ, 5 ఎక్స్‌రే యూనిట్లను సమకూర్చారు. రోగుల సహాయకుల కోసం జీ+5 అంతస్తుల్లో 200 మంది సామర్థ్యంతో ధర్మశాల నిర్మించారు. 30 డెడ్‌బాడీల సామర్థ్యంతో మార్చురీ, సెంట్రల్ కిచెన్, లాండ్రీ, మెడికల్ ఆక్సిజన్ పైప్‌లైన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. పర్యావరణ అనుకూలంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు 75 శాతం నీటిని ఆదా చేస్తూ ఐజీబీసీ గోల్డ్ రేటింగ్‌ను దక్కించుకుంది.

# అటవీ భూముల్లో గుట్టుగా గ్రావెల్ పనులు

- అటవీ పరిధిలో గ్రావెల్ తరలింపుపై అధికారుల మౌనం
- ఇసుక ర్యాంప్ రహదారికి గ్రావెల్ అనుమతులు ఎవరిచ్చారు?
- జోరుగా పనులు.. నిబంధనలు గాలికేనా?
- అనుమతుల ఉన్నాయా.. లేక అధికారుల అండదండలా?
- కోడి ముత్తయ్య గుంపు ఇసుక ర్యాంప్ రహదారికి గ్రావెల్ తరలింపుపై విమర్శలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

మణుగూరు, ప్రభాత గమనం:

కోడి ముత్తయ్య గుంపు ఇసుక ర్యాంప్‌కు వెళ్లే రహదారిపై గ్రావెల్ తరలింపు, పోసే పనులు జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అటవీ పరిధిలో రహదారి నిర్మాణం, గ్రావెల్ తరలింపునకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయా? ఉంటే వాటిని ఎవరు మంజూరు చేశారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామంలోని సాధారణ రహదారులకు గ్రావెల్ తరలించే సమయంలో నిబంధనలు, అనుమతులను ప్రస్తావించే అధికారులు.. ఇసుక ర్యాంప్ రహదారి విషయంలో మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారనే చర్చ జరుగుతోంది. అటవీ ప్రాంతంలో గ్రావెల్ తరలింపు, రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి అటవీ శాఖ నుంచి అధికారిక అనుమతులు తీసుకున్నారా? అన్నది స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

## అనుమతి ఎవరిచ్చారు?

కోడి ముత్తయ్య గుంపు ఇసుక ర్యాంప్ రహదారికి గ్రావెల్ తరలింపునకు అనుమతి ఎవరు ఇచ్చారు? అటవీ శాఖ అనుమతి ఉంటే దానికి సంబంధించిన ఉత్తర్వులు, షరతులు ఏమిటి? అటవీ భూమి పరిధిలో ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారా? అనే అంశాలపై అధికారులు వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

## నిబంధనలు అందరికీ ఒకటేనా?

అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ బాధ్యత కలిగిన అధికారులు నిబంధనల అమలులో ఎలాంటి తేడా చూపకూడదని స్థానికులు అంటున్నారు. సాధారణ గ్రామ రహదారుల విషయంలో నిబంధనలు కఠినంగా అమలు చేస్తే, ఇసుక ర్యాంప్ రహదారి విషయంలోనూ అవే నిబంధనలు వర్తించాల్సిందేనని పేర్కొంటున్నారు. గ్రావెల్ తరలింపులో నిబంధనలు ఉల్లంఘించబడ్డాయా? అనుమతులు లేకుండానే పనులు జరుగుతున్నాయా? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని వారు కోరుతున్నారు. ఇసుక ర్యాంప్ నిర్వహణ పేరుతో అటవీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



P-03_Layout 2 18-Aug-26 01:40 AM Page 1



# ఘనంగా ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలు

తొర్రూర్ ఆగస్టు 17(ప్రభాత గమనం):

తొర్రూరు మండలం సోమరాం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఝాన్సీ రెడ్డి జన్మదిన వేడుకలను ముందస్తుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఝాన్సీ రాజేందర్ రెడ్డికి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఝాన్సీ రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# గురుకుల అడ్మిషన్ కోసం తల్లి గోడు

- ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు

తిరుమలగిరి ఆగస్టు 17(ప్రభాత గమనం):

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలి మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురాగా, మొత్తం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో లాజరు వెల్లడించారు. వాటిలో మూడు రెవెన్యూ శాఖకు, ఒకటి విద్యాశాఖకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు. "నా కొడుకుకు మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో అడ్మిషన్ ఇప్పించండి సార్" అంటూ ఓ తల్లి విద్యాశాఖ అధికారులను వేడుకోవడం ప్రజావాణిలో భావోద్వేగానికి గురిచేసింది. గురుకులాల ప్రవేశం కోసం తన కుమారుడు కామన్ ఎంట్రెన్స్ పరీక్ష రాసినా ఎక్కడా అడ్మిషన్ సీటు లభించలేదని, తమకు ముగ్గురు పిల్లలు ఉండటంతో ప్రైవేట్ విద్యను భరించే ఆర్థిక స్థోమత లేదని ఆమె వాపోయింది. తన కుమారుడికి చదువుపై ఉన్న ఆసక్తిని చూసి అడ్మిషన్ కోసం కలెక్టర్, ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి వేడుకున్నానని, బీసీ వెల్ఫేర్ కమిషనర్‌కు సైతం అర్జీ పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని తల్లి తన గోడును అధికారుల ఎదుట వెళ్లబోసుకుంది. ఇదిలా ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన చేయిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రజాసంఘాల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కనీస మౌలిక వసతులు లేకుండానే కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణికి వ్యవసాయం, విద్యుత్, వైద్యం, పోలీస్, విద్య, మహిళా శిశు సంక్షేమం, పశువైద్యం, గ్రామీణ నీటిపారుదల తదితర శాఖల మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్ కుమార్, డీటీ జాన్ మహ్మద్, ఎంపీఓ భీమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.






# గుంతలమయంగా పుల్లూరు-గార్ల రోడ్డు

"రోడ్డు బాగుపడుతుందన్న ఆశతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా అధికారులు వెంటనే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి" అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

- ఆర్ఎన్‌బీ రోడ్డుకు గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు!
- ఏళ్లుగా ఇదే దుస్థితి.. నిత్యం నరకయాతన పడుతున్న ప్రజలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం..
- ప్రమాదాలు పొంచి ఉన్నా పట్టించుకోని అధికారులు
- రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్



గార్ల, ఆగస్టు 17 (ప్రభాత గమనం):

పుల్లూరు–గార్ల ప్రధాన రహదారి అధ్వానంగా మారి ప్రజలకు నరకయాతన చూపిస్తోంది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రహదారి మొత్తం గుంతలమయంగా మారింది. రోడ్డు ఎక్కడుందో.. గుంతలు ఎక్కడున్నాయో గుర్తించలేని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రమాదాల ముప్పు పెరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## గుంతలను తప్పించడమే పెద్ద సవాల్

పుల్లూరు నుంచి గార్లకు రాకపోకలు సాగించే వాహనదారులు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పరిస్థితి దారుణంగా ఉంది. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం పొంచి ఉంది. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.

## వర్షం పడితే మరింత ప్రమాదం

చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి వాటి లోతు కనిపించకుండా పోతోంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి దుస్థితి కారణంగా ప్రయాణ సమయం పెరగడంతో పాటు వాహనాలు తరచూ దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

## అత్యవసర ప్రయాణాలకూ ఇబ్బందే

అనారోగ్యంతో ఉన్న వారిని ఆసుపత్రులకు తరలించే సమయంలో ఈ రహదారి మరింత సమస్యగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. అంబులెన్సులు, ఆటోలు, చిన్న వాహనాలు గుంతల కారణంగా అత్యవసర ప్రయాణాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు.

## శాశ్వత పరిష్కారం కావాలి

ఏళ్లుగా పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని స్థానికులు అంటున్నారు. అప్పుడప్పుడు గుంతలు పూడ్చడం కాకుండా రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారి పరిస్థితిని అంచనా వేసి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

## ప్రమాదం జరిగాక స్పందిస్తారా?

రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడి ప్రమాదాల ముప్పు పెరిగినా అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా ముందుగానే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అవసరమైన నిధులు కేటాయించి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

## అధికారుల దృష్టికి రాదా?

ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణించే ఈ రహదారి దుస్థితి అధికారుల దృష్టికి రాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పుల్లూరు–గార్ల రహదారి సమస్యపై అధికారులు ఇకనైనా స్పందిస్తారా? లేక ప్రజల నరకయాతన ఇలాగే కొనసాగుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

# కేటాయించిన ఇళ్లలో నివసించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



వరంగల్ బ్యూరో ఆగస్టు 17(ప్రభాత గమనం):

నిరుపేద కుటుంబాలకు సొంత ఇళ్లు ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వెంటనే నివసించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు.సోమవారం శాయంపేటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల బ్లాక్‌లను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా బ్లాక్‌లను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటివరకు ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే తమకు కేటాయించిన ఇళ్లలో నివసించాలని కోరారు. ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్లు మంజూరై, కేటాయింపు పూర్తయిన వారు వెంటనే తమ ఇళ్లలోకి వెళ్లి నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 19 బ్లాక్‌లకు గాను ప్రస్తుతం 6 బ్లాక్‌లకు విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. మిగతా బ్లాక్‌లకు కూడా వారం రోజుల్లోగా విద్యుత్ సౌకర్యం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ పీడీ సిద్దార్థ్ నాయక్, ఈఈ, హౌసింగ్ ఏఈ, డీఈలు పాల్గొన్నారు.

# తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి

- శక్తి విలీనాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీల నిరసన

కేసముద్రం ఆగస్టు 17(ప్రభాత గమనం):

తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని, పాలిటెక్నిక్ విద్యను శక్తిలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేసముద్రం సిబ్బంది సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ..పాలిటెక్నిక్ విద్య రాష్ట్రంలో సాంకేతిక విద్యకు కీలకమైన పునాది అని, దాని ప్రత్యేకతను మరియు స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బంది ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. "పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి శక్తిలో విలీనాన్ని నిలిపివేయాలి" అనే డిమాండ్‌తో నల్ల బ్యాడ్జీల ద్వారా తమ నిరసనను శాంతియుతంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరిగతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

మహబూబాబాద్ ఆగస్టు 17(ప్రభాత గమనం):

జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికే 'ప్రజావాణి' కార్యక్రమమని, ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ నాగవాని ల తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చట్ట నిబంధనల ప్రకారం అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వచ్చిన కొన్ని దరఖాస్తులలో కేసముద్రం మండలం బేరువాడ కు చెందిన శ్యామల, అదేవిధంగా గార్ల మండలం తిర్లాపురం గ్రామానికి చెందిన మాలోత్ వెన్నెల ఇద్దరు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరిపెడ మండలం పురుషోత్తమాయ గూడెం గ్రామానికి చెందిన దాట్ల భార్గవ్ నిరుపేద కుటుంబానికి చెందిన తనకు సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల 6వ తరగతి ప్రవేశం ఇప్పించగలరని కోరారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (110) దరఖాస్తులు వచ్చాయి.



# బుద్ధారం–డాక్య తండా రోడ్లకు మోక్షమెప్పుడో?

- బీటీ రోడ్ల నిర్మాణానికి సీపీఐ డిమాండ్..
- ఎంపీడీవోకు వినతి పత్రం అందజేత

గార్ల, ఆగస్టు 17 (ప్రభాత గమనం):

ఏళ్లుగా ఎదురుచూస్తున్న రహదారి సౌకర్యం ఎప్పుడు మెరుగుపడుతుందోనని బుద్ధారం, డాక్య తండా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడితే చాలు రహదారులు మరింత అధ్వానంగా మారుతుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని సీపీఐ గార్ల మండల సమితి నాయకులు పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం గార్ల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రత్యేక నోడల్ అధికారిగా వ్యవహరించిన ఎంపీడీవో మంగమ్మకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. బుద్ధారం అండర్‌గ్రౌండ్ నుంచి బుద్ధారం గ్రామం వరకు, గోపాలపురం నుంచి డాక్య తండా వరకు బీటీ రోడ్లు నిర్మించాలని వినతిలో కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బుద్ధారం, డాక్య తండా గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారులు బురదమయంగా మారి రాకపోకలు కష్టతరమవుతున్నాయని అన్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించడంలో,




విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడంలో, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రయాణించడంలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మెరుగైన రహదారి వ్యవస్థ ఎంతో అవసరమని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రెండు మార్గాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజావాణిలో అందించిన వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాగం లోకేష్, మేదరమెట్ల గిరిప్రసాద్, హరినాయక్, ఎర్రగడ్డ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మీని కొనసాగించాలి

- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

కేసముద్రం ఆగస్టు 17(ప్రభాత గమనం):

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ కేసముద్రం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిషేధించే కుట్రను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మానుకోవాలన్నారు. నిరుపేద బిడ్డల పెళ్లి భారం కాకూడదని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ అనే గొప్ప పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. పథకాలను నిషేధిస్తే పేదింటి ఆడబిడ్డలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నాదని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేని యెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆడబిడ్డలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్రీనాథ్ రెడ్డి, కమటం శ్రీనివాస్,కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి,కౌన్సిలర్ వినయ్ రెడ్డి, ఏర్పుల కుమార స్వామి, లక్ష్మినారాయణ,రాహుల్, దేవేందర్, వెంకన్న, కన్నెబోయిన శ్రీను, యాకరాజ్యం, ఆవుల ఐలయ్య, రాకేష్ రెడ్డి, రాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం

- పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి అనుసంధానం చేయద్దు
- లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేయొద్దు
- ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వెలుగు శ్రావణ్, పట్ల మధు
- ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవహారం...

కేసముద్రం ఆగస్టు 17(ప్రభాత గమనం):

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ కి అప్పగించవద్దని, ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ లో ఐటీఐ, ఏటిసిలతో కలిసి డిప్లొమా కోర్సులను అనుసంధానం చేసే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేయవద్దని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వెలుగు శ్రావణ్, పట్ల మధు డిమాండ్ చేశారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీలోని స్థానిక బ్రహ్మంగారి గుడి సెంటర్ లో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జీవో నెంబర్ 97 కు వ్యతిరేకంగా మానవహారం, నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుండి బ్రహ్మంగారి గుడి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వెలుగు శ్రావణ్, పట్ల మధు మాట్లాడుతూ...స్కిల్ యూనివర్సిటీ పేరిట కొత్త పాలసీ తీసుకువచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర సరికాదని, దీని ద్వారా పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ పూర్తిగా అధ్యాపకుల నియామకాల నుంచి మొదలుకొని అడ్మిషన్ల వరకు కూడా మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల్లోకి వెళుతుందన్నారు. పాలిటెక్నిక్ కాలేజీలను సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి తొలగించి, ఉద్యోగులను శక్తిశాఖలో విలీనం చేస్తే ఇంజినీరింగ్ కాలేజీలు, ఎంబీఏ, ఎంసీఏ, బీబీఏ, బీసీఏ లాంటి కోర్సులకు అనుమతులెలా ఇస్తారని ప్రశ్నించారు. అదే విధంగా లాటరల్ ఎంట్రీ విధానంతో పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ లో 2వ సంవత్సరంలోకి అవకాశం ఉండేదని, దీనితో పాలిటెక్నిక్ 3 సంవత్సరాలు, ఇంజనీరింగ్ 3 సంవత్సరాలు మొత్తం 6 సంవత్సరాలలో ఇంజినీరింగ్ పూర్తి అయ్యేదని, కానీ లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేస్తే 7 సంవత్సరాల్లో ఇంజనీరింగ్ చదవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి సమాంతరంగా పీపీపీ విధానాన్ని తీసుకురావడం ఎందుకని? ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఫీజుతో విద్యను అందిస్తున్నప్పుడు వాటికి అవసరమైన నిధులు, ల్యాబ్‌లు, సిబ్బంది కల్పించకుండా కొత్తగా ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వాయం (పీపీపీ) వ్యవస్థను ఎందుకు ప్రోత్సహిస్తున్నారనీ, స్కిల్ యూనివర్సిటీ కౌన్సిల్ లో ఏడుగురు కూడా పారిశ్రామిక వేత్తలు ఉన్నారని, వారే ప్రభుత్వ విద్యను అందులో పాలిటెక్నిక్ విద్యను వ్యాపార మాయం చేసే కుట్ర చేస్తున్నారని, ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ లో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి, అధ్యాపకుల భర్తీ, ల్యాబ్ ల ఆధునీకరణ, వర్క్ షాప్ ల నిర్వహణ, హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరి కాదని, వెంటనే ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 తీసుకొని అందులోని విషయాలు విద్యార్థులకు బహిర్గతం చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, జీవో నెంబర్ 97 ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేయవద్దని, పాలిటెక్నిక్ కాలేజీలను సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి తొలగించి, ఉద్యోగులను శక్తిశాఖలో విలీనం చేయవద్దని తెలిపారు. లేని పక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం గురి తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చొప్పరి శరత్, మేక వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాకేష్, నాయకులు గోర్కటి అఖిల్, ప్రణదీప్, మహంకాళి చరణ్, జి. సాగర్, రోహిత్, అశ్వంత్, ప్రవళిక, హర్షిత, సాక్షిత, నవ్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## అడ్డగుట్టలో ఘనంగా బోనాల ఉత్సవాలు

- పాల్గొన్న టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ ఆగస్టు 17(ప్రభాత గమనం):

అడ్డగుట్టలో బోనాల ఉత్సవాల సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన మల్లన్న ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు, స్థానిక ప్రజలను కలుసుకుని బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మల్లన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్,సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మనోజ్ ఆకుల,రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్,రాష్ట్ర నాయకులు సుతారపు రంగన్న,సాయి గణేష్స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి పై బీఆర్ఎస్ సమరశంఖం

- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా ఎక్కడ?
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన నేతలు

గార్ల, ఆగస్టు 17 (ప్రభాత గమనం):

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసాగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు గార్లలో ఆందోళనకు దిగారు. పథకాలను కొనసాగించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గార్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ శీలం శెట్టి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద అందించే సాయానికి అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ప్రజల ఓట్లు పొందిన అనంతరం ఆ హామీని విస్మరించిందని విమర్శించారు.పథకాల అమలుపై ఏర్పడిన న్యాయపరమైన పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతే కారణమని రమేష్ ఆరోపించారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు ఇప్పటికే ఆర్థిక భారంగా మారుతున్నాయని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఆర్థిక సాయం అందకపోవడం కుటుంబాలపై మరింత భారం మోపుతున్నదన్నారు.అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆయన.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. మహిళా లోకానికి ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని, ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన సమాధానం ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. పథకాలను వెంటనే పునరుద్ధరించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బుడిగ మురళి, కొండల్ నాగయ్య, రాములు, బాలు,




గడ్డం అశోక్, మీగడ శ్రీనివాస్, ఖదీర్ రెడ్డి, మల్ల ఉమేష్, గద్దపాటి నరసింహ, తాళ్లూరి అనిల్, శ్రీనాథ్, మహేష్, విజయ్ కుమార్, సలీం, బండారి వెంకట్, రాందాసు, వెంకటేశ్వర్లు, విజయ్, వెంకటేష్, దేశపాక మురళి పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

- ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన సీపీఎం పార్టీ మండల నాయకులు

కేసముద్రం ఆగస్టు 17(ప్రభాత గమనం):

కేసముద్రం మున్సిపాలిటీ లోని ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఎం పార్టీ మండల నాయకులు అధికారులను కోరారు. సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కమిటీ కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడుతూ.. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలు గుర్తించి బోర్డులు పెట్టారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకొని క్రీడా మైదానాలు, మినీ పార్కులు ఏర్పాటు చేయాలన్నారు. జ్యోతిబాపూలే సెంటర్లో బస్ షెల్టర్ ఏర్పాటు చేసి, ప్రధాన కూడల్లలో (సులబ్ కాంప్లెక్స్ )లు నిర్మించాలని పేర్కొన్నారు. అభివృద్ధి పేరునా రోడ్ల విస్తరణలో భాగంగా షాపులు కోల్పోయిన, చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారులు, వ్యాపారుల కోసం షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని లేనియెడల ప్రభుత్వ భూములలో ఎర్రజెండాలు పెట్టి పేదలకు పంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు చాగంటి కిషన్, నీరుటి జలంధర్, అల్లుగొండ సావిత్ర, బండి దర్గయ్య, నిమ్మల ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- 101-డోర్నకల్ నియోజకవర్గంలో 2,05,083మంది ఓటర్లు
- 102- మహబూబాబాద్ నియోజకవర్గంలో 2,31,863 మంది ఓటర్లు
- సెప్టెంబర్ 16 వరకు దావాలు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం
- ఫారం-6, 7, 8 ద్వారా దరఖాస్తులకు అవకాశం
- బీఎల్ఓలతో పాటు ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు సమర్పించవచ్చు
- ప్రతి ఓటరూ జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ ఆగస్టు 17(ప్రభాత గమనం):

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం–2026లో భాగంగా 101–డోర్నకల్, 102– మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 571 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 4,36,946 ఓటర్లు ఉన్నారని ఇందులో 101–డోర్నకల్ నియోజకవర్గంలో 2,05,083 మంది ఓటర్లు ఉన్నారని, 102– మహబూబాబాద్ నియోజకవర్గంలో 2,31,863 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో 2,15,458 మంది పురుష ఓటర్లు, 2,21,449 మంది మహిళా ఓటర్లు, 39 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ప్రతి ఓటరూ తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. అర్హత కలిగిన పౌరుల పేరు ముసాయిదా జాబితాలో లేకపోయినా, ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు, మార్పులు ఉన్నా నిర్ణీత గడువులోగా సంబంధిత దావాలు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. ఈ ఓటర్ల జాబితా (ముసాయిదా) మీ మీ పోలింగ్ కేంద్రాలలో, మీ బిఎల్ఓ ల దగ్గర, స్థానిక తహశీల్దార్ (ఏఈఆర్వో) కార్యాలయంలో, ఆర్డీవో (ఈఆర్వో) కార్యాలయంలో లేదా కలెక్టర్ (డిఈవో) కార్యాలయంలో లభిస్తుందని ఓటర్లు పని దినాలలో ఈ కార్యాలయాలకు వెళ్లి తమ వివరాలను ఎప్పుడైనా తనిఖీ చేసుకోవచ్చునని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం–6, నమోదుపై అభ్యంతరం లేదా పేరు తొలగింపునకు ఫారం–7, ఓటరు వివరాల్లో సవరణలు చేసుకోవడానికి లేదా నివాసం మారిన సందర్భంలో నమోదు మార్పు కోసం ఫారం–8ను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఓటర్లు తమ దావాలు, అభ్యంతరాలను నేరుగా తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కు సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా ఈసీఐనెట్ యాప్ లేదా ఓటర్ సర్వీస్ పోర్టల్ ద్వారా కూడా సంబంధిత దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో దావాలు, అభ్యంతరాలను మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలు, 101–డోర్నకల్, 102– మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాలలో సమర్పించవచ్చని తెలిపారు. దావాలు, అభ్యంతరాల సమర్పణకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. 101–డోర్నకల్, 102– మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, అవసరమైన సందర్భంలో సెప్టెంబర్ 16వ తేదీలోగా ఫారం–6, ఫారం–7 లేదా ఫారం–8 ద్వారా దావాలు, అభ్యంతరాలు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ కోరారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374